# కల్యాణ వేదిక

ఆ రోజు పోస్టులో వచ్చిన ఉత్తరం చదువుకుని స్థాణువులా వుండి పోయింది సులోచన అంతలోనే ఆమె మాతృహృదయం ఒక్కసారి కంపించి పోయింది. చల్లని ఏ.సి. గదిలో వున్నా ఆమెకి ఉక్కపోస్తున్నట్లుగా, ఊపిరాడ నట్లుగా అనిపించింది.

ఏనాటివో జ్ఞాపకాలు వెల్లువలా ఎగిసిపడుతూ ఆమెని ఉక్కిరిబిక్కిరి చేయ దం మొదలుపెట్టాయి.

ఒక్క క్షణమాగి మళ్ళీ చేతిలోని ఉత్తరం చదివింది.

అమ్మా !

నాకీమధ్య ఆరోగ్యం బాగుండలేదు. నెల్లాళ్ళ వరకు కదలకూడదన్నారు డాక్టర్లు. నిన్ను చూడాలని వుంది వీలుంటే ఒక్కసారి రమ్మని కోరుతున్నాను.

నీ

సుధ

సులోచన నెమ్మదిగా కదిలింది. అంతకంటే నెమ్మదిగా కనుకొలుకులలో నీళ్ళూరుతున్నాయి ఆ కన్నీటి తెరల చాటున ఎన్నో దృశ్యాలు కదులుతున్నాయి. కొడుకు మాటలతో నిలవేసిన తీరూ, కోడలు తనవంక ఛీత్కారంగా చూసిన చూపూ. ఇంకా ఎన్నెన్నో దృశ్యాలు కళ్ళముందు చురుకుగా కదిలి ఆమె ఊపిరిని వుక్కిరిబిక్కిరి చేశాయి. కానీ మరుక్షణమే ఆ కన్నతల్లి హృదయం క్షమాసముద్ర మైంది.

ఆమె నెమ్మదిగా కదిలి భర్త వున్న ముందు గది గుమ్మం దగ్గరికి వెళ్ళి -
"ఏమండీ! సుధాని చూసిరావాలొక్కసారి" అంది.

శ్రీపతి తృటికాలం ఆమెవైపు ఆశ్చర్యంగా చూసి, "సరే"అని కారులో వెళ్తే శ్రమలేకుండా వుంటుంది" అన్నాడు.

"నిజమే. మీరూ నాతో వుంటే కొండంత ధైర్యంగా వుంటుంది కూడా!"

"అలాగే. నాలుగు గంటలకి రంగన్నని కారుతో సిద్ధంగా వుండమంటాను."

"రెండు గంటలకే వుండమనండి" దాచినా దాగని ఆత్రుత ధ్వనించిందామె గొంతులో.

* * *

"కొంచెం తల పైకెత్తి చూడూ. ఓయబ్బో! మరీ అంత సిగ్గా" సులోచన గడ్డంకింద చూపుడువేలు పెట్టి, నెమ్మదిగా పైకెత్తింది ఆమె మేనత్త.

అయినా సులోచన కళ్ళెత్తి పెళ్ళికొడుకుని చూడటానికి సాహసించలేదు. పెద్దగా చూడాలని అనిపించలేదు. పెద్దల నిర్ణయానికి తలవంచడం మాత్రమే ఆమెకు తెలుసు. వారు ఎంపిక చేసిన వ్యక్తితో జీవితాన్ని పంచుకోవడమే ఆమెకు అర్థమైన గొప్ప విషయం. అప్పుడామె వయస్సు సరిగ్గా పదహారేళ్ళు

"పెళ్ళయ్యాక భర్తతో పెద్దగా పేచీలు పడలేదు అతనినుండి అపూర్వమైన ప్రేమనూ పొందలేదు. బొంగరంలా తిరుగుతూ పనిచేస్తు, ఎవరేమన్నా నోరెత్తి సమాధానం చెప్పకుండా, అణుకువగా అత్తవారింట్లో మసులుకుంది పెళ్ళయిన పదినెలలకే బిడ్డకి తల్లిగా మారింది.

"అదృష్టవంతురాలివే అమ్మడూ! తొలిచూలు మగపిల్లాడంటే మాటలా మరి! అత్తింట్లో నీకు పెద్ద పీట వేస్తారులే. మీ అత్తగారి నోటికి తాళం పడుతుందిలే" అంటూ బామ్మ మెచ్చుకోలుగా మెరిసే కళ్ళతో తనవైపు చూసినప్పుడు సులోచన లోలోన మురిసిపోయింది.

పక్కకి తిరిగి పడుకున్న పసిగుడ్డుని చూసి గర్వపడింది. ఆ బుజ్జిపాపాయి ఎప్పుడూ నిద్రపోతూ, అప్పుడప్పుడు ఒళ్ళు విరుచుకుంటూ, లక్కపిడత నోరు చప్పరిస్తుంటే ఆశ్చర్యపోయింది.

* * *

పదేళ్ళ తర్వాత ఓరోజు .... ఇల్లంతా ఒక్కసారి ఘొల్లుమంది.

సులోచన గుండె పగిలింది ఏడుస్తూ ఓ మూల కూలబడింది.

మళ్ళీ స్పృహలోకి వచ్చేసరికి అమ్మకి పక్షవాతం వచ్చి కాలూ చెయ్యీ నోరూ పడిపోయాయనీ, ఆస్పత్రిలో చేర్పించారనీ తెలిసింది,

చనిపోయిన భర్తని తల్చుకుని ఏడ్చేందుకూ ఓపికలేదు.

తన బతుకు బండలైందన్న బాధతో మంచానపడిన తల్లి గురించి బెంగ పెట్టుకునే శక్తి లేదు.

దేన్నీ ధైర్యంగా ఎదుర్కొనేందుకు నిబ్బరమూ లేదు. ప్రపంచమంటే తెలీదు. చదువూ సంధ్యాలేదు. అన్నవస్త్రాలు గడిచే మార్గమూ లేదు.

పాలుగారే పసివాడు, పదేళ్ళ కొడుకుని మాత్రం ప్రాణాలు పణంగా పెట్టి కాపాడుకోవాలని తపన.

"ఎవరు మాత్రం ఎల్లకాలం పెట్టి పోషించగలరు?" వదినగారి దీర్ఘాలు, సన్నాయినొక్కులు గుండెల్లో గునపాలైనాయి. అప్పుడామెకి ఇరవై ఆరేళ్ళ నిండు పున్నమి వయసు. అయినింటివాళ్ళకి వంటలే చేసి పెట్టిందో! అర్ధరాత్రి వరకు అప్పడాలే వత్తి అమ్మిందో, అడుగు తడబడకుండా అష్టకష్టాలు పడింది. సుధాకర్‌ని ప్రయోజకుణ్ణి చేయడం కోసం తన శక్తినంతా ధారబోసింది. ప్రతి నిముషాన్నీ పైసగా మార్చి పిల్లవాడి చదువుకి వినియోగించింది.

పదేళ్ళు గిర్రున తిరిగాయి. ఆ రోజు తన ఇంటి తలుపు తట్టిన ఆగర్భ శ్రీమంతుడు లాయరు బ్రహ్మానందంగారిని చూసి అయోమయంలో పడిపోయింది. మూడో సంవత్సరం ఇంజనీరింగ్ చదువుతున్న సుధాకర్‌ని తన అల్లుడిగా చేసుకుని పైచదువులు చదివించి వృద్ధిలోకి తీసుకొస్తానంటే ఆనందంతో ఒప్పుకుంది. ఇన్నాళ్ళకి తనకి, తన కొడుక్కి ఒక అండ దొరికిందని సంబరపడిపోయింది

అవును, అప్పటికామె వయస్సు ముప్పై ఆరేళ్ళు. గొప్పింటి పిల్ల కోడలిగా రావడమే కాకుండా మంచి ఉద్యోగస్థురాలి హోదాలో ఇంట్లో అడుగుపెట్టింది నీరజ.

నీరజకి అత్తగారి అవసరం ఎంత వున్నా అత్తగారియందు గౌరవ మర్యాదలు చూపించే గుణం మాత్రం లేకపోయింది.

అందుకే సులోచన కొడుక్కి, కోడలికీ, జీతం బత్తెం లేని నమ్మకమైన నౌకరైంది.

తెల్లవారి లేచింది మొదలు కొడుక్కి, కోడలికీ అన్నీ అమర్చి సాగనంపుతుంది. అలా పనిచేసుకుపోయేటప్పుడు క్రమంగా తన వాళ్ళకి తను చేసుకుంటు

న్నాననే భావం కంటే ఎవరింట్లోనో తన పొట్ట పోసుకోవడం కోసం కూలిపని చేస్తున్నాననే భావం కలగసాగింది సులోచనకి. తనింట్లోనే తను పరాయిదానిలా బాధపడ నారంభించింది. ఎప్పుడైనా తను లేవలేకపోతే ఎవ్వరూ పట్టించుకోరు. తను పని చెయ్యలేకపోతే, ఎందుకు చెయ్యలేదూ అని కూడా అడగరు. కొడుక్కి కావలసినవి కోడలు చేస్తుంది. అతను హడావిడిగా వెళ్ళిపోతాడు. ఆమె తన పని ముగించుకుని తనూ వెళ్ళిపోతుంది

నీరజ పేదరాలైన అత్తగార్ని పేదగానే చూసి, దూరంగానే వుంచింది. సుధాకర్‌కి కొన్ని అర్థమయినా కానట్లే తప్పుకుపోతాడు.

ఇన్నేళ్ళు కష్టపడినా సులోచనకి మిగిలింది సుధాకర్ మాత్రమే. ఆ ఒక్కటీ ఎవ్వరో స్వంతం చేసేసుకున్న భావన ఆమెని కృంగదీయసాగింది.

"అమ్మా నీకేం కావాల్సినా నీరజనే అడుగు" అని మెత్తగా చెప్పడమే కాకుండా. "నీరజేం పరాయిదా ? అన్నీ తనే చూస్తోందిగా ఇంట్లో. నీ ఒక్క దానికీ ఏం కావాలో నాకు చెప్తావేమిటి ? మనం చూపించటంలో వుంటుంది పరాయి తనం" అంటూ తేల్చాడు.

పోనీ నీరజే అత్తగారికి కావల్సినవి స్వయంగా చూస్తుందా ! ఊహు .... ఏం కావాల్సినా ఆమే అడుగుతుందని వూరుకుంటుంది.

సులోచన మనసులేని ఆ ఇంట్లో పనిచేసే ఒక యంత్రంగా మారింది.

*　　*　　*

మధ్యాహ్నం ఎండ ప్రచండంగా కాస్తోంది. క్షణక్షణం వస్తూపోతూ వున్న కరెంట్ సరఫరా విసిగిస్తోంది పడుకున్న సులోచన లేచి కూర్చుంది, బయట చిరాగ్గా వుంటే అంతరంగం అంతకంటే విసుగ్గా వుంది. ఏదో అసంతృప్తి ఆమెను వేధిస్తోంది. ఒంటరితనం ఆమెని పట్టి పీడిస్తోంది. ఆమె చిన్న వయసులో తోడు కోసం, నీడకోసం బాధపడలేదు. కానీ వయసు పెరిగేకొద్దీ ఏదో తెలీని లోటుగా వుంది. మనసువిప్పి మాట్లాడుకునేందుకు మనిషే కరువైనట్లనిపిస్తోంది. ఆమెతో సుధాకర్ స్థిమితంగా కష్టసుఖాలు మాట్లాడి ఎన్నాళ్ళయిందో ! ఆ రోజు ఆమె పుట్టినరోజు నలభై ఐదు నుండి నలభై ఆరులోకి అడుగుపెట్టింది. తనకెన్నేళ్ళు వస్తే ఎవరిక్కావాలి ? తననెవరు పలకరిస్తారు ? ఇలా ఇంకా ఎన్నాళ్ళు కాలం గడపాలి ? నిట్టూర్చింది.

అంతలోనే తలవిదిలించుకుని, మనసు తిప్పుకుని టేబులుమీదనున్న తెలుగు

పేపరు తెచ్చుకుని ముందరేసుకుని కూర్చుంది. ఉద్యోగాలు చేయగల చదువు లేకపోయినా అక్షరజ్ఞానం ఉన్నందుకు ఆనందిస్తూ.

ఆమె నిత్యం పేపరు మొదటినుండి చివరి దాకా చదువుతుంది. ఎప్పుడైనా మంచి పుస్తకం దొరికితే చదువుతుంది. చదువుతున్న పేపరులో ఆమె చూపులు చటుక్కున్న ఒక చోట ఆగిపోయాయి. చిన్న బాక్స్‌కట్టి ప్రచురించబడిన ఆ ప్రకటన ప్రత్యేకంగా వుంది. దాన్ని పదే పదే చదివింది. ఆమె మనసులో విచిత్రమైన ఆలోచనలు రొదచేయడం మొదలుపెట్టాయి. వాటికి అర్థం వుందో లేదో ఆమె కప్పుడు తెలియలేదుగానీ, ఆ విధమైన వూహలు మాత్రం సాగుతున్నాయి. అవి ఆమెకెంతో వూరటనిస్తున్నాయి. మనిషి అసంతృప్తిలోంచే అన్ని ఆలోచనలు పుడతాయి. దెబ్బతిన్న కొద్దీ ఆలోచనలు తీవ్రతరమవుతాయి. ధైర్యంగా రూపుదిద్దుకుంటాయి. అవమానం భరించి భరించి ఎదురు తిరుగుతుంది మనసు. అలక్ష్యాన్ని చవిచూసి చూసి అలసిపోయిన మనసు తనకంటూ ఏదో కావాలని తపించిపోతుంది.

అందుకే సులోచనలో ఒక మొండి ధైర్యం, తెగింపు ఉవ్వెత్తున లేచాయి. ఆమె చటుక్కునలేచి తలుపు తాళంవేసి వీధి చివర నున్న పోస్టాపీసుకు బయలుదేరింది.

* * *

ఆరోజు తెల్లవారి లేస్తూనే, నేనేమిటిలా తయారయ్యాను? 'నేనేమిటిలా చేశాను?' అని తనని తను నిలేసుకుంది. కానీ అంతలోనే 'ఏంచేశాను నేను? ఎలా తయారయ్యాను?' అని ఎదురుప్రశ్న వేసుకుంది అయితే ఏదో అలజడి మనసునంతా గందరగోళం చేస్తోంది. అస్థిమితంగానే అన్ని పనులు ముగించింది. కొడుకూ, కోడలూ బయటకెళ్ళగానే గుండెలు నిండా ఊపిరి పీల్చుకుంది.

'తనెందుకింత తొందరపడుతోంది?'

ఆమె ప్రశ్నలకి చాలావాటికి ఆమె దగ్గర జవాబులు లేవు. ఏదో అజ్ఞాత శక్తి ఉసిగొల్పి నడిపిస్తున్నట్లుగా వుందామెకి.

తలకి నూనెరాసి చిక్కుతీసుకుని ముడి చుట్టుకుంది. ముఖం రుద్దుకుని చిటికెడు పౌడరు రాసుకుంది. అప్పుడు గమనించింది. తన తలకట్టులో ఎక్కడో గానీ తెల్ల వెంట్రుకలు లేవని, తనకున్న వయసు తన ముఖంమీద కనబడటం లేదని, ఎన్నాళ్ళగానో పెట్టెలో దాచిన ఒకే ఒక జరీఅంచు గుంటూరుచీర తీసి

కట్టుకుంది. ఆరునెలల క్రితం ఆంజనేయస్వామి గుడికెళ్ళినప్పుడు సుధాకర్ ఇచ్చిన ఇరవై రూపాయల్లో పది కాగితం మిగిలింది. అది తీసుకుని తెల్లని రుమాలు మడతలో పెట్టింది ఆమె ఇంటి బయటకి వచ్చేసరికి పదకొండున్నరైంది సరిగ్గా.

'సర్వేజనా సుఖినోభవంతు' అని రాసి వున్న బోర్డు చూసి అక్కడ రిక్షా దిగి డబ్బులిచ్చింది ఆ ఇంటి మెట్లు ఎక్కుతుంటే పాతాళంలోంచి పైకి వస్తున్న భావన కలిగింది. తలుపు తట్టడమెలాగా అని తటాపటాయిస్తూ, గుమ్మానికి కట్టిన పూలతెరవైపు చూసింది. తలుపులు వేసిలేవని గ్రహించింది.

సులోచన అడుగుల చప్పుడైందేమో, తెరపక్కకి వొత్తిగిల్లింది. చిరునవ్వు ముఖంతో ఒకామె సులోచనను లోపలికి ఆహ్వానించింది. సులోచన మాత్రం నిద్రలో నడుస్తున్నట్లు నడిచింది లోపలికి

అక్కడ సోఫాలో ఇద్దరు మగవాళ్ళు కూర్చుని వున్నారు. ఒకతను కొంచెం లావుగా నెరిసిన బట్టతలతో గుండ్రటి ముఖంతో చామనఛాయగా వున్నాడు. సులోచన ఇద్దరినీ అర నిమిషం చూసి తలొంచుకుంది. బట్టతల మనిషి ఆమె లోని అయోమయాన్ని పోగొట్టే ప్రయత్నంలో.

"రామ్మా! చెల్లమ్మా! రా! ఇలా కూర్చో" అన్నాడు. వెంటనే సులోచన చూపులు ఒక్క క్షణం ఆ పక్క వ్యక్తిమీద నిలిచాయి. అతను పలచగా, కొంచెం నెరిసిన తలతో నిండుగా వున్నాడు. ఇంతలో లోపల్నించి ఆమె మంచినీళ్ళగ్లాసుతో వచ్చి, "మంచినీళ్ళు పుచ్చుకోండి. ఇలా సోఫాలో కూర్చోండి" అంది.

చల్లటి నీటిగ్లాసు అరచేతికి తగలగానే ఒళ్ళు జలదరించింది సులోచనకి. తమాయించుకుంది. నెమ్మదిగా కూర్చుంది. బట్టతల బలరాం, అతని భార్య ఆదిలక్ష్మి అన్నీ మాట్లాడారు. సులోచన నిబ్బరంగా నాలుగే మాటలు చెప్పింది.

"నా బతుకు నా కోసమే జీవించటం కోసం, నేను చేసే సేవలకి గుర్తింపు సార్థకతకోసం నా సాంగత్యం కోరుకునే వ్యక్తికోసం, నేను ఈ వయస్సులో ఇలాంట అనూహ్యమైన నిర్ణయం తీసుకున్నాను" సులోచన నెమ్మదిగా చెప్పినా దృఢంగా చెప్పింది. అంతవరకు ఆమెనే పరీక్షగా చూస్తున్న ఆదిలక్ష్మి ఏదో గుర్తు చేసుకున్నట్లు "మీరు ఖండవల్లి మాష్టారి అమ్మాయా" అంది.

సులోచన చురుగ్గా కళ్ళెత్తి ఆశ్చర్యంగా "అవును" అంది.

"నేను ఆదిలక్ష్మిని గుర్తు రాలేదా?"

"అంటే సుందరరామయ్య గారి...."

అంతే ఆదిలక్ష్మి చటుక్కున లేచి సులోచనని కౌగలించుకుంది. ఆమె అప్యాయతకి సులోచన కళ్ళు చెమ్మగిల్లాయి.

ఆదిలక్ష్మి శ్రీపతి దగ్గరగా వెళ్ళి "అన్నయ్యగారూ, మీరెంత అదృష్ట వంతులో నేను చెప్పలేను" అంది ఆనందంతో కళ్ళు మెరుస్తుండగా.

* * *

కారు పెద్ద కుదుపు ఇచ్చింది. సులోచన వాస్తవంలోకి వచ్చింది. శ్రీపతి కూడా వులిక్కిపడి "ఏమిటి ?" అన్నాడు.

"గేద అడ్డమొచ్చింది సార్" అన్నాడు డ్రైవరు.

సులోచన తన కొంగున కట్టుకున్న నాలుగు మడతల పేపర్ కటింగ్ జాగ్రత్తగా విప్పింది. సరిగ్గా ఇరవై సంవత్సరాల క్రితం. ఇప్పుడు ఆమెకి అరవై ఆరు.

మసగ మసగ్గా వున్న చూపుతో మళ్ళీ ఆ పేపరు చదివింది. నిజానికి ప్రత్యే కంగా చదవడానికేముందక్కడ ? అందులో ఏముందో అక్షరం అక్షరం ఆమెకి తెలుసు.

కల్యాణవేదిక

రిటైరయి, రెండువేలు పెన్షన్ తీసుకుంటున్న వ్యక్తికి జీవితంలో కష్ట సుఖాలు అర్థం చేసుకుని స్నేహాన్ని పంచి ఇవ్వగల సహధర్మచారిణి కావాలి. సంప్రదించండి....

సులోచన కాగితం మూసి, వెనక్కి జారగిలబడింది.

* * *

నారింజపండురంగు గద్వాలు చీరలో, మెడలో నగల మధ్య నల్లపూస లతో, అస్తమిస్తున్న సూర్యుడిలోంచి అందిపుచ్చుకున్న అరుణిమ నిండుగా, నుదుటకుంకుమ బొట్టుగా.

కారులోంచి దిగి తన గుమ్మం ఎక్కుతున్న తన కన్నతల్లిని చూసి ఆనందం, ఆశ్చర్యం, దుఃఖం ముప్పిరికొనగా వుక్కిరిబిక్కిరై చూస్తూండిపోయాడు సుధాకర్.

సెప్టెంబర్ '93 (రచన)